



సీతారాంతండాలో నిరాశ్రయులైన వారితో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

సర్వే షురూ..

- భారీ వర్షాలతో.. నష్టాలపై కదిలిన యంత్రాంగం
- సీఎం అదేశాలతో క్షేత్రస్థాయికి అధికారుల పరుగు
- జిల్లాలో 27,542 ఎకరాల్లో వివిధ పంటలకు దెబ్బ
- ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్న వివిధశాఖలు

మరిపెడ మండలం సీతరాంతండాలో పొలంలో ఇసుక మేట





సీతరాంతండాలో మంగళవారం పొలాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లిలో ఇసుక మేట వేసిన వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి

ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 27, 542 ఎకరాల్లో వివిధ పంటలు నీటిలో మునిగిపోయాయని జిల్లా వ్యవసాయాధికారి విజయ నిర్మల ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో పత్తి 5,764 ఎకరాలు, వరి 16,810 ఎకరాలు, మొక్క జొన్న 2,796, ఇతర పంటలు 2,172 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశారు. అలాగే జిల్లాలో 30 ఎకరాల్లో బొప్పాయి తోటలు, 675 ఎకరాల్లో మిర్చి తోటలు నీటమునిగాయని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబాబాద్‌కు వచ్చి పర్యటించిన సందర్భంలో పూర్తిస్థాయి సర్వే జరిపి, నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం నుంచి తిరిగి వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ పంటనష్టంపై వివరాలు సేకరిస్తున్నారు.



కుమ్మరికుంట్ల శివారు రామసముద్రం చెరువును పరిశీలించేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న నీటిపారుదల శాఖ ఈఈ సమ్మిరెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరదలు వచ్చి, తీవ్రంగా నష్టపోయిన పంటలు, రోడ్లు, విద్యుత్, ఇతర శాఖల నష్టాలపై మహబూబాబాద్ జిల్లాలో సర్వే ప్రారంభమైంది. ప్రాథమిక నష్టం వివరాలు కాకుండా.. పక్కాగా క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిసర్వే నిర్వహించి, నివేదిక సమర్పించాలని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో జిల్లా అధికార యంత్రాంగం బుధవారం నుంచి ఫీల్డ్‌సర్వే చేసేందుకు మండలాలకు తరలారు. జిల్లాలో వ్యవసాయ పంటపొలాలకు జరిగిన నష్టంపై వ్యవసాయాధికారులు, వివిధ మండలాల్లో పర్యటిస్తున్నట్లు వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు వివిధ ప్రాంతాలకు కదిలారు.

మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లిలో ఎన్.తిరుపతిరెడ్డి పర్యటించి, ఇసుక మేటలు వేసిన పంటపొలాలను పరిశీలించారు. అలాగే జిల్లాలో వివిధ మండలాల్లో కూడా వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారు. నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మూడు డివిజన్లలో గండ్లుపడ్డ చెరువులు, తెగిన చెరువులను పరిశీలిస్తున్నారు. మహబూబాబాద్, మరిపెడ, నెక్కొండ డివిజన్‌లలో నీటిపారుదల శాఖ అధికారులు తిరుగుతూ తెగిన ప్రాంతాల్లో చెరువులను కట్టలను పరిశీలిస్తున్నారు. చెరువులు తెగిన ప్రాంతానికి వెళ్లేచోట నీరునిల్వ ఉండి బురదమయంగా ఉండడంతో అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దంతాలపల్లి, కుమ్మరికుంట్ల శివారు రామసముద్రం కుంటను పరిశీలించేందుకు అధికారులు వెళ్లలేకపోవడంతో ట్రాక్టర్‌పై వెళ్లి ఆ కుంటలను పరిశీలిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ, అర్‌అండ్‌బీ, పశుసం వర్ధకశాఖల అధికారులు సర్వే చేస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు 100 చెరువులకు నష్టం జరిగిందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేశారు.

చెక్‌డ్యాంల పరిస్థితేంటో..

మహబూబాబాద్ జిల్లాలో ఆకేరువాగుపై 12, మున్నేరువాగుపై 10, పాలేరువాగుపై 7, వట్టివాగుపై 4, అలిగేరు వాగుపై 4, పందిపంపుల వాగుపై 2, రాళ్లవాగుపై 1, బయ్యారంలో 2, వెరసి 42 చెక్‌డ్యాంలు ఉన్నాయి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆకేరు, మున్నేరు వాగులపై నిర్మించిన పలు బ్రిడ్జిలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. వాగులో నిర్మించిన చెక్‌డ్యాంల పరిస్థితి ఏమిటన్నది ఇప్పటి తెలియ రాలేదు. వరదనీటి ప్రవాహం తగ్గితేగానీ ఎన్ని చెక్‌డ్యాంలకు నష్టం కలిగింది. ఎన్ని చెక్‌డ్యాంలు కొట్టుకు పోయాయో అనేది తెలియవస్తుంది. అయితే నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం చెరువులకే పెద్దనష్టం జరిగిందని, చెక్‌డ్యాంలకు నష్టం ఉండకపోవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం వర్షం.. సాయంత్రం ఎండ

జిల్లాలో బుధవారం ఉదయం పలు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురియగా, మధ్యాహ్నం సమయం వరకు ఎండ కాసింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉదయం 8.30 గంటల వరకు 429.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. జిల్లా సగటున 26.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 26.8, గంగారంలో 62.4, బయ్యారంలో 29.4, గార్లలో 26.8, డోర్నకల్‌లో 25.6, కురవిలో 18.8, మహబూబాబాద్‌లో 18.4, గూడూరులో 45.0, కేసముద్రంలో 25.8, నెల్లికుదురులో 55.2, నర్సింహులపేటలో 18.0, చిన్నగూడూరులో 1.8, మరిపెడలో 9.6, దంతాలపల్లిలో 14.8, తొర్రూరులో 26.4, పెద్దవంగరలో 24.6 మి.మీ వర్షపాతం కురిసింది.

వర్షాలతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : డీఏవో విజయనిర్మల

కేవలం రెండ్రోజుల్లోనే 420 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, వివిధ పంటల్లో సస్య రక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల రైతులకు సూచించారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ.. వరిలో ప్రస్తుతం నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వరి పొలాన్ని ఆరబెట్టుకుని, ఇసుక మేటలు ఉన్నట్లయితే ఆ ఇసుకను తీసివేయడం మంచిదన్నారు. పంటలపై పైపాటుగా సూక్ష్మస్థూల పోషకాలు పిచికారి చేయాలని కోరారు. మొక్కజొన్నకు 19:19:19 పిచికారి చేయాలన్నారు. కత్తెర పురుగు ఉధృతిగా ఉన్నట్లయితే ఇమామేక్టిన్ బెంజోమెట్ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పత్తిపంటకుగాను పోటాషియం నైట్రేట్ 19:19:19 పిచికారి చేసుకోవాలన్నారు. మిర్చి వేరు మొదళ్లలో కాపర్ ఆక్సిక్లోరైడ్‌తో పాటు ప్లాంటా మైసిన్ (1240 ఎకరాకు), 3.0 గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరిపెడ రూరల్, సెప్టెంబరు 4 : భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పురుషోత్తమయగూడెం, బాల్నీదర్మారం, సీతారంతండా, ఉల్లెపల్లి శివారు తండాలైన భూక్యతండా, తేజావత్ తండాలో జిల్లా కలెక్టర్ బుధవారంపర్యటించి, అధికారులకు ఆయనదిశానిర్దేశం చేశారు. బాల్నీదర్మారంలో 30 కుటుంబాల వారితో మాట్లాడి వారికి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారంతండాలో పరిశుభ్రత, వైద్య శిబిరాల నిర్వహణపై అధికారులకు తగినసూచనలు చేశారు. కలెక్టర్ వెంట తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, జిల్లా అధికారులు మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, నర్మద, విజయ నిర్మల, మరిపెడ తహసీల్దార్ సైదులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించాలి..

- డోర్నకల్ : ఆకేరు వరదలతో నష్టపోయిన వారి వివరాలను ఇంటింటా తిరిగి సేకరించి నివేదిక అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మండలంలోని ముల్కలపల్లిలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో వెంటనే శానిటేషన్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ప్రతీ ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందించాలని సూచించారు. వరదకుదెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని నేషనల్ హైవే, అర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వరదల్లో కొట్టుకుపోయిన విద్యార్థుల సర్టిఫికెట్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్, రేషన్‌కార్డులు కోల్పోయినవారి వివరాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నర్మద, సంక్షేమ అధికారిణి వరలక్ష్మి, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్యులు సుధీర్‌రెడ్డి, కనక దుర్గ, వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుంది

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



వరద ముంపునకు గురైన ప్రాంతాన్ని సందర్శిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 : ఎవరూ ఆందోళన చెందవద్దని.. వర్షాలతో నష్టపోయిన వారిని రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో వరద ముంపుకు గురైన ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజలతో మా ట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతీ ఒక్కరిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. వరదముంపుగు గురైప్రాంతాలను కాంగ్రెస్ శ్రేణులు పర్యటించి సహాయం అందించాలని సూచించారు. రాజకీయాలను పక్కకుపెట్టి పార్టీల కతీతంగా అంతా కలిసికట్టు గా పనిచేసి ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు, సిరిపురం వీరన్న, సంపంగి రాంచంద్రు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎంపీ రవిచంద్ర నెల వేతనం విరాళం



ఇనుగుర్తి, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితుల కోసం బీఆర్ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఒకనెల వేతనం ప్రకటించి, దాతృత్వం చాటుకున్నారు. బుధవారం ఫోన్‌ద్వారా విలేకరులతో ఎంపీ మాట్లాడారు. అకాల వర్షాలతో వరద ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమన్నారు. మాజీసీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశానుసారం తననెల వేతనాన్ని వరదబాధితుల సహాయార్థం విరాళంగా అందిస్తున్నట్లు చెప్పారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు

మూడు రోజులపాటు నిరంతరాయంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

- 12 ఎక్స్‌కవేటర్లు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, వెయ్యిమంది సిబ్బంది
- ఇంటికన్నె వద్ద పూర్తి.. పర్యవేక్షించిన రైల్వే జీఎం
- మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ
- రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం

7లో..



కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది



ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి చేసిన ప్రాంతంలో ట్రయల్ రన్‌లో వెళుతున్న ప్రయాణికులు లేని సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్

మానుకోటకు ఆరెంజ్ అలర్ట్

- జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. వీలైనంత వరకు ప్రజలు తమ ప్రయాణాలను మానుకోవాలని, అవసమయితే తప్ప బయట కు రాకూడదని స్పష్టం చేశారు. వరదనీటితో నిండిపోయిన రోడ్లను దాటేందుకు ప్రయత్నించకూ డదన్నారు. వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారాయని, వాహనాల టైర్లు జారి కిందపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాలతో ప్రయాణించాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం సూచించిన సూచనల మేరకు ఎప్పటిక ప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలన్నారు. ఏదైనా ప్రమాదం ఎదురైతే వెంటనే డయల్ 100కు ఫోన్‌చేసి పోలీసుల వారి సహాయ సహకారాలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా పోలీస్‌శాఖ 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్ర జల రక్షణ కొరకు తప్పనిసరి పరిస్థితుల్లో పోలీస్‌శాఖ విధించిన ఆంక్షలను ఎవరైన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి..

- మరిపెడ రూరల్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ అన్నారు.బుధవారం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే తప్ప, తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళలో ప్రజలు ఇండ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాల వద్ద ఉంటున్న వారికి ఆహారం, నీరు, కావాల్సిన వస్తువులు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పురుషోత్తమాయగూడెం ప్రజలతో మాట్లాడుతున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

హైలెవల్ వంతెనలు నిర్మించాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య

కొత్తగూడ, సెప్టెంబరు 4 : నర్సంపేట-కొత్తగూడ రహదారిపై ఉన్న లోలెవల్ వంతెనలపై హైలెవల్ వంతెనలు నిర్మించేలా మంత్రి సీతక్క చొరవ చూపాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడ మండలంలోని లోలెవల్ వంతెనలను, భారీ వరదలతో కొట్టుకుపోయిన రోడ్లను బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసిన ప్రతీ సంవత్సరం మండలంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఆవేదన చెందారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



కొత్తగూడలోని గాంధీనగర్ వాగును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నర్సింహులపేట బంధం చెరువు కట్టకు పడిన భారీ గండి



బంధం చెరువు రైతుల బాధలెన్నో!

- చేపల రక్షణకు కంచకడితే చెరువు కట్టకు గండి
- సాగునీరంతా పోయి పంట భూముల్లో ఇసుక మేటలు
- రూ.లక్షల్లో పంట నష్టం.. ఆందోళనలో బాధిత రైతులు

నర్సింహులపేట, సెప్టెంబరు 4 : కొండనాలికకు మందుపెడితే ఉన్న నాలుక ఊడినట్టుంది నర్సింహులపేటకు చెందిన మత్స్య సొసైటీ వారి పనితీరు. గ్రామం శివారులో ఉన్న బంధం చెరువులో చేపల రక్షణ కోసం నిబంధనలకు విరుద్ధంగా చెరువు మత్తడికి ఇనుప కంచ ఏర్పాటు చేసి కట్టడంతో చెరువు కట్టకు భారీ గండిపడి చెరువులోని నిల్వనీరంతాపోయి వరద ఉధృతికి పరివాహక పొలాల్లో 30 నుంచి 40ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టింది. మరో 30 ఎకరాల్లో నాటు కొట్టుకుపోయి రైతులకు లక్షల్లో నష్టం వాటిల్లడంతో బాధిత రైతులు కన్నీటి పర్యతమవుతున్నారు.

నర్సింహులపేట బంధం చెరువు పరివాహకంలో సుమారు 95 మంది రైతులకుగాను 150 ఎకరాలు సాగు భూమి ఉన్నది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సకాలంలో వర్షాలు కురవడంతో వరి సాగును ప్రారంభించిన రైతులు జులై మాసం చివరలో వరినాట్లు వేయడం పూర్తి చేశారు. ఆగస్టు 31న కురిసి వర్షబీభత్సానికి బంధం చెరువులోకి భారీగా వరదనీరొచ్చి చేరింది. స్థానిక మత్స్య సొసైటీ వారు చెరువులో నుంచి చేపలు పోకుండా నిబంధనలకు విరుద్ధంగా మత్తడికి ఇనుప కంచ ఏర్పాటు చేయడంతో వరద ఉధృతి పెరిగి ఇనుప కంచ నుంచి వరదనీరు పోకపోవడంతో చరువు కట్టకు భారీ గండి ఏర్పడి నీరంతా దిగువప్రాంతానికి పోయింది. దీంతో వరదతీవ్రతకు పంట భూమిలో ఇసుక మేటలు, వరినాటు కొట్టుకుపోయి రైతులకు నష్టం వాటిల్లడంతో కన్నీరు పెట్టుకుంటున్నారు.

మత్స్య సొసైటీ వారిపై చర్యలు తీసుకోవాలని..

బంధం చెరువు కట్ట తెగిపోవడానికి కారకులైన మత్స్య సొసైటీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు అలువాల నవీన్, బేతమల్ల రమేష్

మిగతా 8వ పేజీలో..

నీరులేక వెలవెల పోతున్న బంధం చెరువు



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా



గూడూరు మండలం దామెరవంచ గురుకులాన్ని సందర్శిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

గూడూరు, సెప్టెంబరు 4 : పాఠశాలలు, వసతిగృహాల్లో పరిసరాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా అన్నారు. గూడూరు శివారు చంద్రుగూడెంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, దామరవంచలోని గిరిజన బాలుర గురుకుల పాఠ శాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులు, విద్యార్థులు హాజరు పట్టికను తనిఖీ చేశారు ఆపై మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించి వాటికి మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదే శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలు తున్నాయని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమెవెంట ఏఈ శోభన్, వార్డెన్, ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు ఉన్నారు.

స్కూళ్లల్లో పెండింగ్ పనులను పూర్తిచేయాలి

- కొత్తగూడ : మండలంలోని సాధిరెడ్డిపల్లిలోని గిరిజన సం క్షేమశాఖ ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సాధిరెడ్డిపల్లి గిరిజనసంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై అధికారులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, తాగు నీటి కోసం బోర్ల మరమ్మతు పనులను పూర్తిచేయాలన్నారు. డీఈ చందర్, ఏటీడీఓ భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు కల్తి శ్రీను, ఏఈ రవి, ఉపాధ్యాయులు వాసం కృష్ణ, లక్ష్మీనారాయణ, సదర్‌లాల్, పూల్‌సింగ్, రవికుమార్, హరినాథం, లింగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఈనెల 9 వరకు ఎన్పీడీసీఎల్‌లో సెలవులు రద్దు

హనుమకొండ, సెప్టెంబర్ 4: ఈనెల 9 వరకు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించిన నేపథ్యంలో అప్పటి వరకు ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. అత్యవసరంగా కావాలనుకుంటే సీఈ (హెచ్ఆర్డీ అండ్ ట్రైనింగ్)కు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలన్నారు. 16 సర్కిళ్ల ఎస్ఈలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించాలన్నారు. 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తగినంత సామగ్రి, సిబ్బంది, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎలాంటి అవసరం ఏర్పడినా కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు.

కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు



వడ్డెపల్లి, సెప్టెంబరు 4 : హనుమకొండ పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్ తెలిపారు. అధ్యాపకులందరూ డాక్టర్ శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.సుహాసిని, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణ, కంప్యూటర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తోపాటు అధ్యాపకులందరు డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. జి.దివ్య మడికొండ నుంచి వంగరకు, జి.రాజేష్ రెడ్డి నర్సంపేట నుంచి చెన్నారావుపేటకు, జి.అరుణ్ చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు, ఎం.డి.ఫసియొద్దిన్ సీసీఎస్ నుంచి హనుమకొండ ట్రాఫిక్‌కు, ఎం.డి.యాకుబ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

'ఉత్తముల ఎంపిక సవ్యంగా జరగలేదు'

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: హనుమకొండ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక సవ్యంగా జరుగలేదని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఎలాంటి ప్రామాణికత పాటించకుండా ఉత్తముల ఎంపికను జిల్లా విద్యాశాఖ నిర్వహించినట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే ఉత్తములుగా ఎంపిక చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలు ప్రభుత్వ విభాగంలోనే ఉన్నాయని, అలాంటి పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల్లో చోటు దక్కకపోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. నిబద్ధతతో పనిచేస్తున్న వారిని ఎంపిక చేయకుండా అధికారులు వారికి తోచిన విధంగా ఎంపిక చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు గుర్తించడంలో జిల్లా విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందని మరో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్‌లు నిరసన వ్యక్తం చేశారు.

మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రావుల జగదీశ్వర్‌ప్రసాద్

వడ్డెపల్లి, సెప్టెంబరు 4: తెలంగాణ ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరి చేసి వారి ఆర్థికాభివృద్ధి కోసం మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సరిపోయినన్ని నిధులు కేటాయించి అసంఘటితరంగంలో కార్మికులుగా ఉన్న వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హనుమకొండ కేయూ - పెద్దమ్మగడ్డ రోడ్డులోని శారదా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి సదస్సులో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావుల జగదీశ్వర్‌ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ మౌటం కుమారస్వామి, వన్నాల కృపాసాగర్, ఏర్ల వెంకన్న, ఆకుల సుభాష్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, మహిళా నాయకురాలు లలిత, పిట్ట సురేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఉమారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటన జారీ చేస్తామని ఆమె తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2902	2700
పల్లికాయ (సూక)	5300	5100
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6712	4552
పత్తి	7610	5000
పసుపు (కాడి)	--	--
పసుపు (గోల)	--	--
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	17500	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు
ఆన్‌లైన్ ద్వారానే నమోదు
ఇద్దరు విద్యార్థులతో ఒక టీమ్
4 స్థాయిల్లో బహుమతుల ప్రదానం

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 4: భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో పట్టభద్రులైన విద్యార్థులకు మేధాశక్తి పెంపొందించే విధంగా క్విజ్ పోటీలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. జాతీయ స్థాయిలో సాగే ఈ క్విజ్ పోటీలు రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయి వరకు జరుగనున్నాయి. మూడు దశల్లో జరిగే ఈ పోటీల్లో మూడు దశల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని ఆర్‌బీఐ సూచించింది.

ఆన్‌లైన్ ద్వారా నమోదు

ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి ఇద్దరు విద్యార్థులతో కూడిన ఒక టీంగా వెబ్‌సైట్ నందు పేరు నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ ఈనెల 17న రాత్రి 9 గంటల లోపు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ పరీక్ష

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19, 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఈ మూడు రోజుల్లో ఏదైనా ఒక రోజు పరీక్షలో పాల్గొనాలి.

వివిధ దశలు

ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు పాస్ అయిన వారికి రాష్ట్ర స్థాయిలో మరో పరీక్ష ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి జోనల్ (ఐదు రాష్ట్రాలు) కలిపి ఒక పరీక్ష ఉంటుంది. ఇందులో పాస్ అయిన వారికి జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది.

ఈ విద్యార్హతలు ఉండాలి

ఈ క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులై ఉండాలి. 25 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులు.

బహుమతుల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదై పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1 లక్షా 50వేలు, తృతీయ బహుమతి రూ.లక్ష .

జోనల్ స్థాయిలో పరీక్ష రాసిన వారికి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు.

జాతీయ స్థాయిలో..

జాతీయ స్థాయిలో పరీక్ష రాసి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు నగదు బహుమతిగా ఇవ్వబడును.


ప్రత్యేక పోర్టల్

ఆర్‌బీఐ 90 క్విజ్ సంబంధించిన వివరాలన్నీ ప్రతీ రోజు ఆర్‌బీఐ పోర్టల్‌లో తెలియజేయడం జరుగుతుంది. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు ఈ పోర్టల్‌ను ప్రతీ రోజు చూడవచ్చు.

క్విజ్‌లో పాల్గొనండి..

రాజు, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నది.. ఇందులో వరంగల్ జిల్లాలోని పట్టభద్రులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకొని క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.







పంతం పట్టి.. పతకం కొట్టింది..

- పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన 'పరుగుల సివంగి' దీప్తి
- పేద కుటుంబంలో పుట్టినా మొక్కవోని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం
- రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్

పర్వతగిరి, సెప్టెంబరు 4: పంతం పట్టి పతకాన్ని సాధించింది. ఇతరుల లాగా ఆలోచించలేకపోయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తన లక్ష్యాన్ని చేరుకుంది. బరిలోకి దిగిన ప్రతీ పోటీలోనూ పతకమే లక్ష్యంగా దూసుకెళ్లింది. ప్రపంచ అత్యున్నత పోటీలైన పారాలింపిక్స్‌లో కూడా ఏ మాత్రం తడబడకుండా లక్ష్యం దిశగా దూసుకెళ్లి కాంస్య పతకాన్ని అందుకుంది. కాంస్య తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడను వార్తల్లో నిలిచేలా చేసింది. రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డుల్లో నిలిచింది.

పేద కుటుంబంలో జన్మించినా..

మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి ధనలక్ష్మి-యాదగిరి దంపతుల ప్రథమ పుత్రిక దీప్తి. గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ నాలుగో తరగతి నుంచే రన్నింగ్‌పై మక్కువ పెంచుకుంది. ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి నడవడం కన్నా పరుగెత్తుతూనే వెళ్లేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు క్రీడల వైపు మళ్లించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్ ద్వారా ప్రత్యేక తర్ఫీదునిస్తూ ప్రోత్సహించారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో 2016లో పాఠశాల స్థాయిలోనే 'సాయ్'లో శిక్షణకు ఎంపికైంది. శిక్షణ తీసుకుంటూ అక్కడే విద్యాభ్యాసం కొనసాగిస్తోంది.


పారాలింపిక్స్‌లో పతకంతో జివంజి దీప్తి

అవమానాలు ఎదురైనా..

ఇతర అమ్మాయిల మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు హేళన చేసేవారు. అబ్బాయిల లక్షణాలే అధికంగా ఉన్నాయని సూటిపోటి మాటలతో వేధించేవారు. వాటిని పట్టించకోకుండా పాల్గొన్న ప్రతీ పోటీలోనూ పతకమే తన లక్ష్యంగా ముందుకు సాగింది. విమర్శలన్నింటికీ నోటితో గాకుండా పరుగుతోనే సమాధానం చెప్పింది. కూతురును జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి పంపించడానికి గాను కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు తమకున్న ఎకరం పొలాన్ని సైతం అమ్మేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టిన దీప్తి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టింది.

బరిలోకి దిగితే పతకమే..!

చిరుత వేగంతో దూసుకెళ్లే దీప్తి బరిలోకి దిగితే ఖచ్చితంగా పతకం వచ్చి తీరాల్సిందే. పోటీలో నిలిచిన ఇతర క్రీడాకారులను వెనక్కి నెట్టి మరీ పరుగు పందెంలో ముందుకు దూసుకెళ్తుంది. ఆమెలోని వేగాన్ని గుర్తించిన 'సాయ్' అకాడమీ కోచ్ నాగపురి రమేష్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే పరుగుపై దృష్టి సారించింది. మెరుగులు దిద్దితే పల్లెల్లోనూ ఆణిముత్యాలు తయారవుతారనడానికి దీప్తి విజయాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.



ప్రధాని, సీఎం అభినందనలు


ప్రధాని ట్వీట్


సీఎం ట్వీట్

పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పర్వతగిరి మండలానికి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు దీప్తికి ట్విటర్ (ఎక్స్)లో అభినందనలు తెలిపారు. విశ్వవేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన దీప్తి ప్రస్థానం స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా

- 2016లో 'సాయ్' అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నప్పటి నుంచి దీప్తి పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తోంది.
- 2016లో కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. తమిళనాడులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో 5వ స్థానం, 200 మీటర్లలో 6వ స్థానం సాధించింది.
- 2017లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లు, 400 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2018లో రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2019లో ఛత్తీస్‌గడ్‌లో జరిగిన యూత్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. మహారాష్ట్రలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించడమే గాకుండా 100 మీటర్లలో న్యూ మీట్ రికార్డును సృష్టించింది. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. పంజాబ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్.
- అంతర్జాతీయ స్థాయిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లలో కాంస్య పతకం, మిడ్లే రిలేలో రజత పతకం సాధించింది. మొరాకోలో జరిగిన పారా ఏషియా పోటీల్లో 400 మీటర్ల విభాగంలో, జపాన్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి పారాలింపిక్స్‌లో అర్హత సాధించింది.
- ప్రస్తుతం పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసింది.


కోచ్ నాగపురితో దీప్తి

నా కల సాకారమైంది..

నాగపురి రమేష్, సాయ్ అకాడమీ కోచ్

ప్రతీ కోచ్‌కు తన శిష్యులు ప్రపంచంలోనే అత్యున్నతమైన ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కల ఉంటుంది. ఆ కల నాకు దీప్తి ద్వారా సాకారమైంది. నాకే పతకం వచ్చినంత సంతోషంగా ఉంది. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క పతకం కూడా లేకపోవడం కొంత ఆవేదన మిగిల్చింది. దాన్ని భర్తీ చేస్తూ దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. నార్మల్‌గా ఉన్న వ్యక్తులకు శిక్షణనివ్వడం ఎవరికైనా సాధ్యమే కానీ, దీప్తి లాంటి అథ్లెట్‌కు శిక్షణనివ్వడం అనేది సవాళ్లతో కూడుకున్న పని. ఎనిమిదేళ్ల కఠోరసాధనతో ఇది సాధ్యమైంది.

మాజీ మంత్రి ఎర్రబెల్లి అభినందనలు

రాంనగర్: ఒలంపిక్ అథ్లెట్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు. పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జీవాంజి తల్లిదండ్రులకు బుధవారం ఫోన్ చేసి అభినందించారు. పారిస్ ఒలంపిక్ అథ్లెట్‌లో దీప్తి జీవాంజి కాంస్య పతకం సాధించడం యావత్ దేశానికి, తెలంగాణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా దయాకర్‌రావు కొనియాడారు.


దీప్తి సాధించిన పతకాలతో తల్లిదండ్రులు

అదృష్టంగా భావిస్తున్నాం..

జీవంజి ధనలక్ష్మి, యాదగిరి (దీప్తి తల్లిదండ్రులు)

అవలక్షణాలతో పుట్టిన పిల్లలను తల్లిదండ్రులు దురదృష్టంగా భావిస్తుంటారు. కానీ, దీప్తి మాకు జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పరుగు పందెంలో పాల్గొనడానికి గాను మా సర్వస్వం ధారపోశాం. మా నమ్మకాన్ని నిలబెట్టింది.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు..

యుద్ధ ప్రాతిపదికన 3 రోజులపాటు రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ

కేసముద్రం, సెప్టెంబరు 4 : భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె, తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్ ధ్వంసమైంది. దీంతో మూడు రోజులుగా రైళ్లరాకపోకలను పూర్తిగా నిలిపేశారు. ఈ విధ్వంసంతో పాటు రైళ్ల నిలిపివేతతో రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. అయితే రైల్వే యంత్రాంగం ట్రాక్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి.. రైళ్లను పునరుద్ధరించేందుకు ఓ లక్ష్యంతో పనిచేసింది. విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేసి రైళ్లను పట్టాలెక్కించారు. కేసముద్రం - ఇంటికన్నె మధ్య 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుదిదశకు చేరాయి. ఇదే మండలం తాళ్లపూసపల్లి- మహబూ బాబాద్ మధ్యన 432, 434 కిలోమీటరు వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న సుమారు 30 మీటర్ల రైల్వే ట్రాక్‌ను మంగళవారం సాయంత్రమే మరమ్మతులు పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఇంటికన్నె-కేసముద్రం మధ్యన కూడా మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే రైళ్ల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించారు.


ఇంటికన్నె వద్ద పునరుద్ధరణ చేసిన రైల్వే అప్‌లైను ట్రాక్


ఇంటికన్నె వద్ద ఈనెల 1న ట్రాక్ కొట్టుకుపోగా వేలాడుతున్న పట్టాలు (ఫైల్)

మూడు రోజులుగా పనులు..

కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటరు రాయి వద్ద సుమారు 40 మీటర్ల ట్రాక్, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య 432,434 కిలోమీటరు వద్ద సుమారు 30 మీటర్ల రైల్వేట్రాక్ వరద నీటికి కొట్టుకు పోయిన విషయాన్ని అక్కడే కాపలా ఉన్న ట్రాక్‌మెన్‌లు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. దీంతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్ వైపులా వెళ్లే రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య ధ్వంసమైన ట్రాక్‌ను మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరించి సిద్ధం చేశారు. ఇక ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ బాగా ధ్వంసం కావడం, వరద ప్రవాహం ఉండడంతో మరమ్మతులకు భారీ యంత్రాంగం కృషి చేయాల్సివచ్చింది. ఆదివారం సాయం త్రం నుంచి రేయింబవళ్లు 12 ఎక్స్‌కవేటర్ యంత్రాలు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, ఒక రోడ్డు రోలర్‌తోపాటు 600 మంది కార్మికులు, ఇంజనీరింగ్, ఓహెచ్‌ఈ (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్), ఎస్‌అండ్‌టీ (సిగ్నల్ అండ్ టెలికాం) సిబ్బంది, ఉన్నతాధికారులు వెయ్యి మందికిపైగా నిర్విరామంగా పనిచేశారు. సిబ్బందికి భోజనం, నీళ్లు అక్క డికే తీసుకువచ్చి అందించారు. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం అంతా ఒకపెద్ద క్వారీ పరిశ్రమలాగా కనిపించింది. నిరంతరం శ్రమించి ఎట్టకేలకు బుధవారం ఉదయం 10 గంటలకు అప్‌లైను ట్రాక్‌ను సిద్ధం చేశారు.

వేగంగా పునరుద్ధరణ పట్ల హర్షాతిరేకాలు..

ట్రాక్ పూర్తిగా వరద తాకిడికి కొట్టుకుపోయి రైలుపట్టాలు వేలాడుతున్న స్థితి నుంచి మూడురోజుల్లోనే పునరుద్ధరణ చేయడంపట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాక్ మీదుగా తొలుత ఒక గూడ్స్‌రైలును ఆ తర్వాత కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు లేకుండా మూడు రోజులుగా నిలిచి ఉన్న బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ను ట్రయల్‌రన్‌లో భాగంగా పంపించారు. మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను పంపించారు. అందుబాటులోకి వచ్చిన అప్‌లైనుపై గోల్కొండ, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లు, డౌన్‌వైపు హౌరా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను కాషన్ ఆర్డర్‌తో నెమ్మదిగా నడిపించారు. రాత్రి వరకు డౌన్‌లైనును సిద్ధం చేసి గురువారం నుంచి అన్ని రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే అవకాశమున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. మూడు రోజులుగా యుద్ధప్రాతిదికన చేపట్టిన ఈ మరమ్మతు పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్ ప్రత్యేక రైలులో పలుమార్లు ఇంటికన్నెకు వచ్చి సమీక్షించారు. ఇక దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ మూడురోజుల పాటు అక్కడే ఉండి పనులను పూర్తిగా పర్యవేక్షించారు. ఈ మరమ్మతులకు రూ.6కోట్లకుపైగా ఖర్చయినట్లు అంచనా వేస్తున్నారు. మూడు రోజులపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంవల్ల రైల్వేశాఖకు కోట్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం జరిగిన ట్రాక్ ధ్వంసమైన పరిస్థితి ప్రస్తుత మరమ్మతుల దృశ్యాలను పోల్చుతూ 'హ్యాట్సాఫ్ రైల్వే' అంటూ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

రాయనపాడు వద్ద వరదతో ఇబ్బందులు..

గిర్మాజీపేట, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలతో సికింద్రాబాద్ - విజయవాడ మార్గంలోని తాళ్లపూసలపల్లి, ఇంటికన్నె మధ్య ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోగా.. బుధవారం నాటికి మరమ్మతులు పూర్తవడంతో రైళ్లను పాక్షికంగా పునరుద్ధరించారు. అయితే విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ ఇంకా వరద ముంపులోనే ఉండటంతో పలు రైళ్లను వరంగల్ వైపు రాకుండా దారి మళ్లించారు. హైదరాబాద్-శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20గంటలకు వరంగల్‌కు చేరుకుని.. సుమారు 40 నిమిషాల తర్వాత విజయవాడ వైపు బయలుదేరింది. రాత్రి 7.30 గంటల వరకు కొండపల్లిలోనే నిలిచిపోయింది. వరంగల్ నుంచి పలువురు ప్రయాణికులు ఈ రైలులో విజయవాడ, విశాఖపట్టణం వెళ్లారు. ఆ రైలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అక్కడి నుంచి దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. అలాగే సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్ రాకుండా నడికూడ మీదుగా గుంటూరుకు దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరాల్సిన గోదావరి, వందేభారత్ తదితర పలు రైళ్లను ఆలస్యంగా నడికూడ మీదుగా దారి మళ్లిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు వచ్చినపుడు వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ప్రయాణికుల సందడి కనిపించింది. అయితే రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారంతో ప్రయాణికుల సందడి తగ్గింది. రైల్వేస్టేషన్‌లోని హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు.

చదువుల దివిటీ.. గురువు..

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం ● పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవం ● సన్మాన కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే దివిటీలు ఉపాధ్యాయులు. అలా అందరి జీవితాల్లో వెలుగులు నింపే టీచర్ల సేవలను గుర్తు చేసుకుంటూ ఏటా సెప్టెంబరు 5న దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 5న టీచర్స్‌డేను జరుపుకుంటుండగా, మన దేశంలో మాత్రం సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజున నిర్వహించుకోవడం జరుగుతోంది. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పని చేశారు. 1988లో తిరుత్తణిలో ఆయన జన్మించిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. కోల్‌కతా, మైసూర్ యూనివర్సిటీలో ఆయన అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టిన రోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామని ఆయన్ను అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట. అందుకే 1962వ సంవత్సరం నుంచి ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. నాడు మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్వికస్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి రాధా కృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ క్రమంలోనే సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మాగాంధీ కీర్తించారు. యుగపురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి కీర్తించారట హోవెల్ అనే మహనీయుడు. అంతేకాదు తనలోని మామూలు మనిషిని దర్శించిన మహర్షి అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ కూడా రాధాకృష్ణన్ గొప్పతనాన్ని చాటారు. అయితే గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడిగా, గొప్ప గురువుగా కీర్తించబడ్డారు. ఈనేపథ్యంలోనే భవిష్యత్ తరాలు ఆయన మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును టీచర్స్ డే గా జరపాలని నాటి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిర్ణయం తీసుకున్నారు.

కాగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమకు చదువుచెప్పే గురువులను ఘనంగా సత్కరించుకునేందుకు సిద్ధమవయ్యారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 'ఉత్తములు' వీరే..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పాఠశాల, ఇంటర్మీడియేట్ విద్యాశాఖల నుంచి మొత్తం ఐదుగురిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది.

కొంక అనురాధ



వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2009లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలుగా ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని వేచరేణి జడ్పీహెచ్‌ఎస్‌లో ఉద్యోగం పొందారు. అక్కడ 3 ఏళ్లు పనిచేసిన అనంతరం ప్రస్తుత జనగామ జిల్లాలోని కామారెడ్డిగూడెం జడ్పీహెచ్‌ఎస్‌లో 2013 నుంచి 2015 వరకు, 2017 నుంచి 2022 వరకు చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేశారు. జీవో నెం.317లో రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చి ఇక్కడే పనిచేస్తున్నారు. స్కూల్లో కిచెన్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడంలో కృషి చేయడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది.

కె.ఇందుమతి



కె.ఇందుమతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరారు. అనంతరం 2001లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చి ఇక్కడే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

పి.సంపత్‌కుమార్



2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కెమిస్ట్రీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ప్రస్తుత సిద్దిపేట జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011లో వరంగల్ జిల్లాలోని రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. అనంతరం 2018 నుంచి 2021 వరకు వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇక్కడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2024లో బదిలీపై వరంగల్ జిల్లా నర్సంపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

జి.వెంకటయ్య



1983లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల జడ్పీహెచ్‌ఎస్‌లో ఉద్యోగంలో చేరారు. సిద్దిపేట జిల్లాలోని శనిగరం జడ్పీహెచ్‌ఎస్, కరీంనగర్‌లోని గొడిశాల జడ్పీహెచ్‌ఎస్‌లో 1996 వరకు ఎస్జీటీగా పనిచేశారు. అక్కడి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కరీంనగర్‌లోని సిర్సపల్లి యూపీఎస్‌లో పనిచేశారు. 2001లో జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొంది వరంగల్ జిల్లాలోని ఫోర్ట్ వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. 2017లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుత ములుగు జిల్లాలోని మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. ప్రస్తుతం 2024 నుంచి వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

డాక్టర్ ఎల్.కొమురారెడ్డి



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి 2002లో హనుమకొండ జిల్లా చిన్నకోడెపాక జడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ లాంగ్వేజ్ పండిట్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011 బదిలీపై మనుగొండ యూపీఎస్‌లో పనిచేశారు. 2012లో కాలేజ్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ల పరీక్షలో ఉత్తీర్ణులై వరంగల్ జిల్లాలోని నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా చేరారు. 2018లో బదిలీపై హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో 2024లో ప్రస్తుతం నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో విధులు నిర్వర్తిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో..

అమరేందర్‌రెడ్డి, రాజయ్య





భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ అమరేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గూడెల్లి రాజయ్య అవార్డు అందుకోనున్నారు.

రజనీకాంత్



కాటారం: గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆడెపు రజనీకాంత్ ఎంపికయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో రజనీకాంత్ ఒకరు.

సుధాకర్‌రెడ్డి



జఫర్‌గడ్, సెప్టెంబరు 4 : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు కుందూరు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి.. 2002లో ములుగు వెంకటాపూర్ మండలం బాపూసింగ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. 2013లో జఫర్‌గడ్ మండలం కూనూరు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి.. ఇటీవల జులై నెలలో ఇదే మండలం తిడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

అధ్యాపకుల విభాగంలో..

కేడీసీ కెమిస్ట్రీ అధ్యాపకుడు శ్రీనివాస్



కేయూ క్యాంపస్: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 22 ఏళ్ల బోధనానుభవం కలిగిన డాక్టర్ వాసం శ్రీనివాస్ విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలకు అవార్డుకు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా సంగెం మండలకేంద్రానికి చెందిన శ్రీనివాస్.. 2002లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై 2010లో పదోన్నతి ద్వారా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో నిర్వహిస్తున్నారు. గతంలో ములుగు, సిద్దిపేట ప్రభుత్వకళాశాలల్లో పనిచేశారు. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో సుమారు 31 పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలుగు అకాడమీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వర్సిటీల కెమిస్ట్రీ 11 పాఠ్యపుస్తకాలను ప్రచురించారు.

ఫిజిక్స్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి



కేయూ క్యాంపస్: కేయూ ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 35 ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం కలిగిన బైరు వెంకట్రామిరెడ్డి ఫిజిక్స్ విభాగంలో విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వర్సిటీ రిజిస్ట్రార్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, డీన్ అకడమిక్‌గా, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్‌గానూ విశిష్ట సేవలందించారు. వరంగల్ జిల్లా పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బైరు వెంకట్రామిరెడ్డి 1992లో కేయూ నుంచి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. 2003లో యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో ఫిజిక్స్ అధ్యాపకులు ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

చెరువులో దూకి గర్భిణి ఆత్మహత్య


మమత (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 4 : చెరువులో పడి గర్భిణీ ఆత్మహత్య చేసుకున్న ఘటన భూపతిపేటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. భూపతిపేట గ్రామానికి చెందిన భైరి మమత (25)తో భర్త ఎల్లస్వామి తరుచుగా మద్యం సేవించి ఘర్షణ పడుతుండేవాడు. దీంతో మమత అదే గ్రామంలో ఉన్న పుట్టింటికి ఇటీవల కాలంలో వెళ్లింది. మమత నిండుగర్భిణీ కావడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హెల్త్‌చెకప్ కోసం వెళ్లింది. ఆమెను పరీక్షించిన వైద్యులు పుట్టబోయే శిశువు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని ఆమెకు చెప్పారు. దీంతో అప్పట్నుంచి మనోవేదనకు దిగాలుగా ఉంటూ తమ సమస్యను తల్లి యాకమ్మకు చెబుతూ.. కన్నీటిపర్యంతమయ్యేది. మంగళవారం తల్లితోపాటు మమత నిద్రకు ఉపక్రమించింది. తల్లి యాకమ్మ తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో లేచి చూసే సరికి పక్కన మమత లేకపోవడంతో కంగారుగా చుట్టుపక్కల వెతికింది. బంధువుల ఇండ్లలో వాకబు చేసింది. ఎక్కడ మమత ఆచూకీ లభ్యం కాకపోవడంతో గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే బుధవారం భూపతిపేట శివారు చెరువులో మమత విఘతజీవిగా కన్పించడంతో గ్రామస్తులు తల్లి యాకమ్మకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మమత మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలు తల్లియాకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాయం చేయడానికి ముందుకురావాలి

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు బానోత్ నెహ్రూరాథోడ్


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బానోత్ నెహ్రూరాథోడ్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 : ప్రకృతి విపత్తుల సమయంలో నష్టం వాటిల్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయాల్లో వారికి సాయం చేయడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు బానోత్ నెహ్రూరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 19వవార్డు పరిధి ఎంపీయూపీఎస్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో బుధవారం 30మంది వరద ముంపు బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెహ్రూరాథోడ్ మాట్లాడుతూ ఇతరులు ఆపదల ఉన్న సమయంలో తమకు తోచిన సాయం అందించి వారికి ధైర్యాన్నివ్వాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, ఐఎంఏ బాధ్యులు డాక్టర్ రూప్‌లాల్, డాక్టర్ తల్లాడ సతీష్, డాక్టర్ వైదేహి, డాక్టర్ దేవేందర్, గాడిపెల్లి సతీష్, ఎడ్ల శ్రీనివాస్, గునిగంటి జగన్ పాల్గొన్నారు.

పదో రోజుకూ.. బస్టాండే దిక్కు

- నిరుపేద కర్మకాండలకు వినియోగించిన కుటుంబ సభ్యులు


కేసముద్రం బస్టాండ్‌లో మల్లయ్య దశదిన కర్మ నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం, సెప్టెంబరు4 : నిరుపయోగంగా మారిన కేసముద్రం బస్టాండ్ ఓ నిరుపేద కర్మకాండలు నిర్వహించేందుకు ఉపయోగపడింది. స్థానిక బ్రహ్మంగారి తండాకు చెందిన ఓర్సు మల్లయ్య అనారోగ్యంతో గతనెల 26న మృతి చెందగా, ఆయన బంధువులు వచ్చేంత వరకు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ ఆవరణలోనే మృతదేహాన్ని ఉంచిన విషయం విదితమే. ఈ క్రమంలో మల్లయ్యకు ఇక్కడ సొంతఇల్లు లేకపోవడంతో పది రోజులుగా ఆయన కుటుంబసభ్యులు బస్టాండ్‌లోనే ఉంటూ.. బుధవారం దశదిన కర్మలు నిర్వహించడం గమనార్హం.

స్టేషన్ హైస్కూల్‌ను పరిశీలించిన డీఈవో

కేసముద్రం, సెప్టెంబరు 4 : ఇటీవలె భారీ వర్షాలతో కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ పూర్తిగా కూలిపోయిన ప్రాంతాన్ని జిల్లా విద్యాశాఖాధికారి వి.రాజేశ్వర్ బుధవారం పరిశీలించారు. తరగతి గదుల్లోకి నీరు వచ్చి విద్యార్థుల పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకానికి చెందిన నాలుగు క్వింటాళ్ల బియ్యం నీళ్లలో తడిచిపోయినట్లు ఉపాధ్యాయులు డీఈవోకు వివరించారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, జి.శ్రీనివాస్, ముదిగిరి సదయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

'క్షేత్రస్థాయికి వెళ్లి పంట సర్వే చేయాలి'

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 4 : మహబూబాబాద్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో క్షేత్రస్థాయిలో వెళ్లి పూర్తిస్థాయిలో పంటల వివరాలను సేకరించాలని, సర్వే నెంబర్ వారీగా రైతుల వివరాలు నమోదు చేయాలని, తప్పుడు నివేదికలు రాస్తే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎ.శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో బుధవారం మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, గార్ల, కొత్తగూడ, గంగారం మండలాల వ్యవసాయ అధికారులు, విస్తీర్ణ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారులు, విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు4 : ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టు మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆర్డీవో అలివేలు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బుధవారం అధి కారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలో భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని గుర్తించి పనులు చేపట్టాలని సూచించారు. మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, టీపీఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి

- వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

సీరోలు, సెప్టెంబరు 4 : వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లు, పంటలు, రోడ్ల మొదలగు వాటిపై ఇంటింటి సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మోదుగుగడ్డతండాలో-40, దుబ్బగడ్డతండా-45 గృహాలను బుధవారం సందర్శించి ప్రజలకు జరిగిన నష్టాలను అడిగితెలుసుకుని దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. వర్షానికి తడిసిన సర్టిఫికెట్లు, పట్టాపాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కోల్పోయిన వారి వివరాలు సేకరించి వారికి సర్టిఫికెట్లు అందించేలా చర్యలుతీసుకోవాలన్నారు. రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలు, పశువుల ప్రాణనష్టం, పంటనష్టం, ఆస్తినష్టం మొదలగు వివరాలు సేకరించుటకు ప్రత్యేక అధికారులను నియమించి వెంటనే సర్వేపూర్తి చేయాలన్నారు. రానున్న రెండు, మూడురోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారుల సూచనల మేరకు అధికారులు ఎవరు కూడా సెలవులు తీసుకోవద్దని పేర్కొన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయం అందించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు జిల్లాలోని ప్రతీ మండలానికి అధికారులు ప్రత్యేక బృందాలను నియమించమని, వారు వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలకు వైద్యం, మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డోర్నకల్, సీరోలు మండలాల ప్రత్యేకాధికారులు, జడ్పీ సీఈవో నర్మద, వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మీ, ఏడీ ఎస్‌ఎల్‌ఆర్ నరసింహమూర్తి,తహసీల్దార్లు కృష్ణవేణి, శారద, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


దుబ్బగడ్డ తండాలో ప్రజలకు దుప్పట్లు అందజేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

- మోదుగుగడ్డతండా, దుబ్బగడ్డతండాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్, మండల ఇన్చార్జీ కాలం రవీందర్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ చేతుల మీదుగా ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి హనుమా, వెంకన్న, బానోతు రాము, లక్ష్మీనారాయణ, సురేష్, హుస్సేన్ నాయక్, భూక్య లక్ష్మణ్, రాంబాబు, బిచ్చు, వీరు, నరేష్, బాబురావు, మోహన్ పాల్గొన్నారు.

వరద సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తా

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్


సర్వాపురం సమీపంలో వరద నీటిలో పర్యటిస్తున్న మురళీనాయక్

కేసముద్రం, సెప్టెంబరు 4 : భారీ వర్షాలతో వరద కారణంగా నష్టపోయిన ప్రాంతాలను, ప్రజల వివరాలను సేకరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సర్వాపురం, రంగాపురం, ఉప్పరపల్లి, వెంకటగిరి, కేసముద్రం స్టేషన్‌లోవరద ముంపునకు గురైన ప్రాంతాలను, పంటలను, ఇళ్లను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద కల్వర్టు చిన్నగా ఉండడం వల్ల వరద షాపులు, ఇళ్లలోకి వచ్చిందని ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. హైస్కూల్ నుంచి వచ్చే వరద కాల్వను దారిమళ్లించిన విషయాన్ని పరిశీలించారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, మాజీ సర్పంచ్ భట్టు శ్రీను, తరాల వీరేష్, చిలువేరు సమ్మయ్యగౌడ్, నూకల వెంకటేశ్వర్లు, అరిగె విజేందర్ ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- మహబూబాబాద్ రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు సాగు చేసిన పంటలు నష్టపోవడం బాధకరమని, ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ రైతులకు భరోసా కల్పించారు. వీఎస్.లక్ష్మీపురంలో పెద్దచెరువుకు గండిపడి వరద ఉధృతికి కొట్టుకు పోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు వెంటనే కట్టమరమ్మతుల అంచనా నివేదికను పంపించాలని ఆదేశించారు. అనంతరం మీసాల వెంకన్నకు చెందిన రెండు రూముల పెంకుటిల్లు కూలిపోవడంతో దానిని పరిశీలించారు. గ్రామపార్టీ అధ్యక్షుడు మీసాల వెంకన్న, సురేష్, నర్సయ్య, సోమిరెడ్డి, బుచ్చయ్య, లింగన్న, నరేష్, సత్యనారాయణ, బిక్షపతి, ఆనంద్ పాల్గొన్నారు.

బంధం చెరువు రైతుల బాధలెన్నో!

(5వ పేజీ తరువాయి)

బొమ్మిశెట్టి వెంకన్న, గుండాల బిక్షం, వెన్నం పుల్లారెడ్డి, సోమిరెడ్డితో పాటు మరికొందరు ఇసుక మేటలు వేసిన ప్రదేశంలో నిలబడి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు, ఏవోకు ఫిర్యాదు చేశారు.

కాలమ్మై కరువైంది..

అలువాల నవీన్, రైతు నర్సింహులపేట

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలతో అతివృష్టి ఏర్పడితే నర్సింహులపేటలో మత్స్య సొసైటీ వారు చేసిన తప్పిదం వల్ల కాలమ్మై. కరువైంది. బంధం చెరువు కింద 2.20 ఎకరాలు వరి సాగు చేశాను. ఎకరానికి రూ.35 వేలు చొప్పున రూ.90 వేలు ఖర్చుచేశాను. వరద ఉధృతికి పంట భూమిలో పూర్తిస్థాయి ఇసుక మేటలు వేశాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కంచ ఏర్పాటు చేయడం విరుద్ధమే..

రాజ్‌కుమార్, ఇరిగేషన్ డీఈఈ, మరిపెడ

చెరువులు, కుంటల మత్తళ్లకు ఇనుపకంచ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమే. నర్సింహులపేట బంధం చెరువు మత్తడికి ఇనుప కంచ ఏర్పాటు చేయడంతో ఇనుప కంచలో చెత్తా చెదారం తట్టుకొని చెరువు కట్టకు భారీ గండి పడింది. బాధ్యులపై చర్యలకు ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.


మత్తడికి మత్స్య సొసైటీ వారు ఏర్పాటు చేసిన ఇసుప కంచ, పంట పొలాల్లో నిరసన తెలుపుతున్న రైతులు

రోడ్లు, డ్రెయినేజీ కాల్వల పునరుద్ధరణకు నిధులను కేటాయించాలి

- సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మునిసిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాల్వల పునరుద్ధరణకు నిధులు కేటాయించి తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 25వవార్డు పరిధిలోని ధర్మన్నకాలనీలో బుధవారం సీపీఐ ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల ప్రభావంతో రోడ్లు, డ్రైనేజీలు, కాల్వలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. రోడ్లన్నీ జలమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, మంద శంకర్, మాలోతు రవీందర్, తండా శ్రీనాథ్, రాకేష్, శ్రీను, మధు, పృథ్వీ, రమ, గంగ, సమ్మక్క పాల్గొన్నారు.

అలుగుపడ్డ కంభాలపల్లి పెద్ద చెరువు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ మండలం కంభాలపల్లి పెద్ద చెరువు నిండి అలుగుపోస్తుంది. ఈ చెరువు 25 ఫీట్ల లోతు ఉంటుంది. ప్రస్తుతం మూడు ఫీట్లతో బుధవారం అలుగుపడింది. ఈ పెద్ద చెరువు కింద సుమారు 3500 ఎకరాల పంట సాగు అవుతుంది. దీంతో పెద్ద చెరువు అలుగుపోయడంతో దాని పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రెండు పంటలకు సమృద్ధిగా నీరందుతుందని రైతులు చెబుతున్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

నెల్లికుదురు, సెప్టెంబరు 4 : పురుగుల మందుతాగి తాపీమేస్త్రీ మృతి చెందిన ఘటన నెల్లికుదురులో బుధవారం జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. తెలిపోలు నరేష్ (36) తాగుడుగు బానిసై జీవితం మీద విరక్తి చెంది మంగళవారం పురుగుమందు తాగాడు. గమనించిన గ్రామస్థులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతినికి భార్య తెలిపోలు మమత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కోన్నాడు.

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

నెల్లికుదురు, సెప్టెంబరు 4 : సీతారంపురం, రాజులకొత్త పెల్లి ఆలేరు, నర్సింహులగూడెంలో చెరవులకు గండ్లుపడటంతో బుధవారం ఎమ్మెల్యేమురళీనాయక్ పరిశీలించారు. వరదకు కొట్టుకపోయి వరిపొలాలను, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో చెరువుల గండ్లు పూడ్చడానికి నిధులు మంజూరు చేస్తుందని, నష్టపరిహారం చెల్లిస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, గుగులోతు బాజీనాయక్ పట్నంశెట్టి నాగరాజు, జెల్ల వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చెత్తాచెదారాన్ని తొలగించాలి'

నెల్లికుదురు, సెప్టెంబరు 4 : రావిరాలలో బుధవారం పారిశుధ్య పనులను అదనపు కలెక్టర్ లెనిల్ వత్సల్‌టొప్పో పరిశీలించారు. చెరువులు తెగిరావిరాలలో వరదతో పారిశుధ్యం పేరుకు పోయిందని అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధులలో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. గ్రామస్థులకు స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. ఇండ్లుకూ నష్టపోయిన బాధితుల సర్వే వెంటనే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక నియామకాలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 9 సాయంత్రం 4.30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను తెలుగు-2, ఇంగ్లీష్-2, కామర్స్-1, పొలిటికల్ సైన్స్-1 ఖాళీలు ఉన్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునే బీసీ అభ్యర్థులకు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) సబ్జెక్టులో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్. సెట్. పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూల తేదీలు తెలియచేస్తామన్నారు.

తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

- తొర్రూరు : తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బొలగాని రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్-2, జువాలజీ - 1 పోస్టు ఖాళీగా ఉందని, సంబంధిత సబ్జెక్టులలో పీజీ, ఓసీ, బీసీలకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 95421 10611లో సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్‌లో..

- తొర్రూరు రూరల్ : గుర్తూర్ మోడల్ స్కూల్‌లో అవర్లబెసిక్స్‌లో ఫిజిక్స్ బోధించడానికి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌తో పాటు బీఈడీ పూర్తి చేసిన ఉండాలన్నారు. అసక్తిగల అభ్యర్థులు ఈనెల 6వ తేదీన తమఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో మురళీధర్

పెద్దవంగర, సెప్టెంబర్ 4 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, ట్యూస్‌డేల్లో చేస్తున్న కార్యక్రమాల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా జ్వరపీడితులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. అవసరం ఉన్నచోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ప్రబలకుండా ఉండేందుకు నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్‌ను వేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆహార పదార్థాల నిల్వల పట్ల, వంటకు ఉపయోగించే నీరు, తాగు నీరును పరిశుభంగా ఉంచాలన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయి, మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు జాగ్రత్తలపై సూచనలు అందించాలని కోరారు. తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఎంఎల్‌హెచ్‌పీ మహిపాల్, ఏఎన్‌ఎం హరిత, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'రక్తదానం మరొకరికి ప్రాణదానం'


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

తొర్రూరు, సెప్టెంబరు 4 : మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రొద్దుటూరి గౌరీశంకర్ అన్నారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వారోత్సవాల్లో భాగంగా తొర్రూరు వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలను నిలబెడుతుందని, ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. 34 యూనిట్ల రక్తాన్ని సేకరించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసత్రికి అందించామని, రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. అనంతరం క్లబ్స్ ఆధ్వర్యంలో సెయింట్ పాల్స్ స్వదార్ హోమ్‌లో అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు, నోట్ బుక్స్, నాప్‌కిన్ ప్యాడ్స్, టవల్స్ పంపిణీ చేపట్టారు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈనెల 9వ తేదీ వరకు సేవా కార్యక్రమాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బిజ్జాల అనిల్ కుమార్, కార్యదర్శి రాము, సరస్వతి క్లబ్ అధ్యక్షుడు మచ్చ సోమయ్య, సిల్వర్ స్టార్ అన్నపూర్ణ అధ్యక్షుడు మచ్చ సురేష్, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు లింగమూర్తి, వనిత క్లబ్ అధ్యక్షురాలు దారం గాయత్రి, చత్రపతి యూత్ అధ్యక్షుడు సాయితేజ, క్లబ్ సభ్యులుపాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి విస్తృత పర్యటన

నర్సింహులపేట, సెప్టెంబరు 4 : మండల కేంద్రంతో పాటు పెద్దనాగారం, కొమ్ములవంచ, జయపురం, రామన్నగూడెం, పడమటిగూడెం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మలతో పాటు అధికారుల బృందం బుధవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వరి, పత్తి పంటలను పరిశీలించారు. బాధిత రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అందజేయాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్‌కు ఆదేశించారు. జిల్లా సహాయ సంచాలకుడు విజయ్‌చంద్, ఏవో విజయ్‌కుమార్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

పంట నష్టపోయిన వారిని ఆదుకుంటాం

మరిపెడ రూరల్ : అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా అగ్రికల్చర్ అధికారిణి విజయనిర్మల అన్నారు. బుధవారం మండలంలోని సీతారాంపురం, ఉల్లేపల్లి, మండలంలోని మరో 8 రెవెన్యూ గ్రామాల్లో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. ఏడీఏ విజయచంద్ర, ఏవో వీరాసింగ్, మనోహర్, రైతులు తదితరులు ఉన్నారు.

ముల్కలపల్లి రహదారి పునరుద్ధరణ పనులు

డోర్నకల్, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆకేరుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో ముల్కలపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భారీగా నష్టం జరిగింది. ముల్కలపల్లి మీదుగా వెళ్తున్న మహబూబాబాద్-కోదాడజాతీయ రహదారి 365/ఎపై ఉన్న హైలెవల్ వంతెన వరదకు కొట్టుకుపోయింది. దీంతో ఖమ్మం-మహబూబాబాద్‌ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు, వంతెన సైతం కొట్టుకుపోవడంతో నేషనల్ హైవే అధికారులు బుధవారం వాటిని పరిశీలించారు. వంతెన పక్కనే ఉన్న లోలెవల్ వంతెన అలాగే ఉండడం గమనార్హం. ఆ వంతెనను ఉపయోగంలోకి తీసుకువచ్చి రాకపోకలు సాగించేందుకు వీలుగా మరమ్మతులు చేపట్టారు. వారం రోజుల్లో పాత వంతెనపై నుంచి రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జాతీయ రహదారి నిర్మాణ సాధికార సంస్థ అధికారులు తెలిపారు.

హాస్టల్లో రెండోరోజూ తనిఖీ చేసిన ఆర్డీవో


మైనార్టీ పాఠశాల హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న నర్సింహారావు

తొర్రూరు, సెప్టెంబరు 4 : డివిజన్ కేంద్రంలోని మైనార్టీ పాఠశాల హాస్టల్‌లోని గోడలకు విద్యుత్ సరఫరాఅయి విద్యార్థులు షాక్‌కు గురవుతున్నారని తమ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం ఆర్డీవో నర్సింహరావు విద్యుత్ అధికారులతో కలిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విచారణ చేపట్టారు. పాఠశాల ఆవరణలో రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ సరిగా చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం హాస్టల్‌లోని గోడలకు విద్యుత్ సరఫరా అవుతుందని విద్యార్థులు భయపడి తమ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో హాస్టల్ వద్దకు వచ్చిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ వనజ లోనికి అనుమతించకపోవడంతో విద్యార్థులు మరింత భయభ్రాంతులకు గురయ్యారు. మంగళవారం ఎంపీడీవో తనిఖీ చేసి వివరాలు తెలియజేయకపోవడం, ఆర్డీవో స్థాయి అధికారి తనిఖీలు చేసినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ విష యం చెప్పకోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయం పై ఆర్డీవోను వివరణ కోరగా నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. తనిఖీ చేసిన వారిలో విద్యుత్ ఏఈ వంశీ, తహసీల్దార్ వినోద్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

నిరుపేదలకు సహాయం అందించడం వరం

కురవి, సెప్టెంబరు 4 : నిరుపేదలకు సహాయం అందించడం గొప్పవరమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. నల్లెల్లలో డెస్టిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సామగ్రి అందించారు. ఈ సందర్భంగామ మాట్లాడుతూ పేదలకు సహకారం అందిస్తున్న డెస్టిని ఫౌండేషన్ చైర్మన్ సోను రాజ్‌పుత్, డైరెక్టర్ కిషన్‌ను అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు వీరభద్రం పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరువుల మరమ్మతులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 4 : అకాలంగా కురిసిన వర్షాలకు కోతకు గురైన చెరువు కట్టలకు ఇరిగేషన్ అధికారులు పరిశీలించి మరమ్మతు పనులు చేయించారు. వెల్లికట్టె, హరిపిరాల, మాటేడు చెరువులు కోతకు గురై ప్రమాదకరంగా ఉండగా స్పందించిన ఐబీ అధికారులు గ్రామస్థుల సహకారంతో బుధవారం ఇసుక బస్తాలు వేయించి తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు దేవయ్య, ప్రభు, నగేష్, ప్రతికంఠం దేవేందర్ రాజు, ధీకొండ శ్రీనివాస్, కొమ్ము సోమన్న, కృష్ణ, మల్లేష్, వెంకన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

'విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

గార్ల, సెప్టెంబర్ 4 : సీజనల్ వ్యాధులకు గురవుతున్న రోగులకు వైద్య సేవలు అందించడానికి సిబ్బంది అందుబాటు ఉండాలని, తమ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సుపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రాములు హెచ్చరించారు. బుధవారం గార్లలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పసరిసరాలతో పాటు వైద్య సిబ్బంది రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హనుమంతరావు, శ్రీధర్, హెడ్‌నర్సు స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్విని మృతికి విద్యార్థినుల నివాళి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాల నీటి ఉధృతికి కారులో ప్రయాణిస్తున్న యువశాస్త్ర వేత్త నూనావత్ అశ్విని ఆత్మకు శాంతి కలుగాలని విద్యార్థినులు కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. జిల్లా కేంద్రంలోని వర్సిటైల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఖలీద్‌పాషా ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులు అశ్విని చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఖలీద్‌పాషా మాట్లాడుతూ చిన్నతనంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగిన అశ్విని భవిష్యత్తులో వ్యవసాయరంగాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తారని ఆశిస్తున్న సమయంలో ప్రయాణిస్తున్న కారు నీటి వరద ఉధృతిలో కొట్టుకుపోయి తండ్రి మోతీలాల్, కూతురు అశ్విని తిరిగిరాని లోకాలకు వెళ్లడం దురదృష్టకరమన్నారు. అశ్విని, ఆమెతండ్రి మోతీలాల్ ఆత్మకుశాంతి కలుగాలని కోరారు.

'నష్టపోయిన వారిని ఆదుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ కోరారు. మునిసిపల్ 16వవార్డు పరిధిలోని ఏటిగడ్డతండా, గిరిప్రసాద్‌నగర్, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్ కాలనీల్లో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు, సైడ్‌డ్రైనేజీ కాల్వలను పునరుద్ధరించాలని చెప్పారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బడుగుల లక్ష్మయ్య, బానోత్ సురేష్, బొజ్జా వెంకన్న, చుక్కల రాజు, సురేష్, వెంకటేష్, ఎస్కే. యాకూబ్, శ్రీను పాల్గొన్నారు.